Digital, tmedia.net.in

# టీ-మీడియా

సంపుటి : 8
సంచిక : 300
పేజీలు : 3
మంగళవారం 02.06.2026

మెయిన్ ఎడిషన్

సామాజికం.. ప్రజల పక్షం...

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## సుప్రీంకోర్టులో ఐదుగురు కొత్త న్యాయమూర్తుల నియామకం

**టి మీడియా, జూన్ 1, ఢిల్లీ బ్యూరో :**



కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు లో ఐదుగురు కొత్త న్యాయమూర్తులను నియమించింది. ఈ మేరకు కేంద్ర న్యాయశాఖ సోమవారం నోటిఫికేషన్ వెలువరించింది. ఈ జాబితాలో సీనియర్ న్యాయవాది వి మోహన , జస్టిస్ శ్రీ చంద్రశేఖర్ , జస్టిస్ షీల్ నాగు, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ్, జస్టిస్ అరుణ్ పల్లి ఉన్నారు. ఇటీవలే సీజేఐ నేతృత్వంలోని కొలీజియం వీరి పేర్లను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. వీరిలో వి మోహన ఒక్కరే సీనియర్ న్యాయవాది.న్యాయవాది మోహన 1988లో కోయంబత్తూరు లా కాలేజీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. అయిదేళ్ల లా డిగ్రీ మొదటి బ్యాచ్ విద్యార్థి. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ఇందు మల్హోత్రా, సీఎస్ వైద్యనాథన్‌ల వద్ద జూనియర్‌గా ఉన్నారు. 1996లో ఏఓఆర్ పరీక్ష పాసైన తర్వాత ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్వతంత్రంగా ప్రాక్టీస్ ప్రారంభించారు. వివిధ కేసుల్లో సీనియర్ న్యాయవాదులు కపిల్‌సిబల్, కేకే వేణుగోపాల్, పీ చిదంబరం, అరుణ్ జైట్లీ, అంధ్యార్జునలతో కలిసి పనిచేశారు. 2015 ఏప్రిల్ 23న సీనియర్ న్యాయవాది హోదా పొందారు. ఈమె చేరికతో సుప్రీం కోర్టులో మహిళా జడ్జిల సంఖ్య రెండుకు చేరినట్లయింది.

# వడ్లు కొనకపోతే... జూన్ 15 తర్వాత యుద్ధమే



- తుమ్మడిహట్టి నిర్మించి 2 లక్షల ఎకరాలకు నీళ్లు
- కాగజ్‌నగర్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

**టి మీడియా, జూన్ 1,కుమురం భీం ఆసిఫాబాద్:** వడ్లు కొనకపోతే జూన్ 15 తర్వాత కేంద్రంపై యుద్ధమేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన వడ్లు, మక్కలు, జొన్నలు కేంద్రం కొనాలని, అలా కేంద్రాన్ని ఒప్పించే బాధ్యత కిషన్‌రెడ్డేనని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించిన సీఎం.. కోతారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో పాల్గొన్నారు. అర్హులైన అందరూ ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోవాలని సూచించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పైలాన్?ను ఆవిష్కరించారు. నెలరోజుల్లో ఇల్లు నిర్మాణం చేసుకొనేలా కొత్త టెక్నాలజీ తీసుకొస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అనంతరం కాగజ్?నగర్? సభకు హాజరయ్యారు. ఆదిలాబాద్ జిల్లాకు గతంలో అన్యాయం జరిగిందని, తాను సీఎం అయ్యాక జిల్లాను అభివృద్ధి చేస్తామని మాట ఇచ్చామని.. అందులో భాగంగానే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం 62 లక్షల క్వింటాల వడ్లు కొనుగోలు చేసిందని, మొత్తం 75 లక్షల క్వింటాల వడ్లు కొంటుందని తెలిపారు. జూన్ 15 నాటికి వడ్లు కొనుగోలు పూర్తవుతుందని, ఆ తరువాత తాము సేకరించిన వడ్లు, మక్కలు, జొన్నలను కేంద్రం కొనాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్‌లోని ప్రాజెక్టులను ఏ మాత్రం పట్టించుకోలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఆయన ఇవాళ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్? నగర్?లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. తుమ్మడిహట్టి నిర్మించి ఆదిలాబాద్‌లోని 2 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం ముంపునకు గురయ్యే 2వేల ఎకరాలు తెలంగాణకు కేటాయించాలని మహారాష్ట్ర సీఎంకు లేఖ రాశానని, కానీ ఇప్పటివరకు స్పందనే లేదన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దూతగా వ్యవహరించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. తనను మహారాష్ట్ర సీఎం వద్దకు కిషన్‌రెడ్డి తీసుకెళ్లాలని ఆయన కోరారు.

### ఆదివాసీలకు వందకు వంద శాతం ఇల్లు

ఇందిరమ్మ ఇల్లు మహిళ ఆత్మగౌరవమన్న సీఎం.. గూడెల్లో ఉన్న పేదలకు 21 వేల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇల్లు ఇంకా పూర్తిస్థాయిలో రాలేదని కొందరు చెప్పారని.. తండాలు, గూడెల్లో ఉన్న ఆదివాసీలకు వందకు వంద శాతం ఇల్లు ఇవ్వాలని ఆదేశాలిస్తున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని స్పష్టం చేశారు.

### తల తాకట్టు పెట్టైనా నిధులు ఇస్తా

గూడెల్లో గుడిసెలు ఉండకూడదని, పక్కా ఇల్లు కట్టించి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికష్టాలున్న ఇందిరమ్మ బిల్లు గంట కూడా ఆగకుండా చూసుకుంటున్నట్లు చెప్పిన రేవంత్?రెడ్డి..తల తాకట్టు పెట్టైనా నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో మరో రెండున్నర లక్షల ఇళ్లను నూతనంగా మంజూరు చేస్తున్నట్లు వేదికపై నుంచే ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి ప్రకటన చేశారు. గూడెం ఉన్న ప్రతి ఒక్కరికి ఇల్లు ఇస్తామని స్పష్టం చేశారు.కాళేశ్వరంలో పెట్టిన రూ.లక్ష కోట్లు గోదావరిలో కలిసిపోయాయని సీఎం విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో ఆదిలాబాద్‌లోని ప్రాజెక్టులను మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. తుమ్మడిహట్టి నిర్మించి ఆదిలాబాద్‌లోని 2 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. తుమ్మడిహట్టి నిర్మాణం కోసం మహారాష్ట్ర సీఎంకు లేఖ రాసినా.. ఇప్పటి వరకు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు సమస్య వస్తే మహారాష్ట్రకు నష్టం వస్తుందని సీఎం చెప్పారు.

## 20 అమెరికా సైనిక కేంద్రాలను ధ్వంసం చేసిన ఇరాన్..

### శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా అంచనా

**టి మీడియా, జూన్ 1, ఢిల్లీ బ్యూరో :**




అమెరికా, ఇరాన్ మధ్య జరిగిన వార్‌లో తీవ్ర నష్టం జరిగింది. అమెరికాకు చెందిన సుమారు 20 సైనిక కేంద్రాలను ఇరాన్ ధ్వంసం చేసినట్లు తెలిసింది. శాటిలైట్ ఇమేజ్‌ల ఆధారంగా ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ ఈ అంచనా వేసింది. అనుకున్న దాని కన్నా ఎక్కువ స్థాయిలో దాడులు జరిగాయని, అమెరికాకు భారీగానే నష్టం జరిగినట్లు ఆ ఇమేజ్‌ల ద్వారా అభిప్రాయపడ్డారు. పశ్చిమాసియాలో ఉన్న 8 దేశాలను ఇరాన్ టార్గెట్ చేసింది. ఆ దాడులు వల్ల అమెరికాకు చెందిన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, రీఫుయలింగ్ ఎయిర్‌క్రాఫ్ట్, రేడార్లు ధ్వంసం అయ్యాయి.అయితే ఇరాన్ షేర్ చేస్తున్న ప్లానెట్ సంస్థ శాటిలైట్ ఇమేజ్‌లపై అమెరికా నిషేధం విధించింది. ఇతర అంతర్జాతీయ ప్రొవైడర్ల ద్వారా శాటిలైట్ పిక్స్ తీసుకున్న ఆ మీడియా సంస్థ.. ప్లానెట్ కంపెనీకి చెందిన పాత ఇమేజ్‌లతో పోల్చింది. సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, కువైట్, ఇరాక్, జోర్డాన్, బహ్రెయిన్, ఒమన్ దేశాల్లో ఉన్న అమెరికా కేంద్రాలను ఇరాన్ టార్గెట్ చేసింది. కొన్ని సంస్థల అంచనా ప్రకారం సుమారు 28 అమెరికా బేస్‌లు ధ్వంసం అయినట్లు తెలుస్తోంది. ఖరీదైన హార్డ్‌వేర్ డ్యామేజ్ కూడా జరిగింది.యూఏఈలోని అల్ రువాయిస్, అల్ సదర్‌తో పాటు జోర్డాన్‌లో ఉన్న మువాఫక్ సాల్టీ ఎయిర్‌బేస్‌ను డ్యామేజ్ చేశారు. అమెరికా ప్రస్తుతం 8 థాడ్ బ్యాటరీలను ఆపరేట్ చేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా కొన్ని ప్రదేశాల్లో వాటిని మోహరించింది. ఆ బ్యాటరీలను ఆపరేట్ చేయాలంటే కనీసం-100 మంది కావాల్సిందే. వాటి ఇంటర్‌సెప్టార్ ఖరీదు రౌండ్‌కు 12.7 మిలియన్ల డాలర్లు. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్‌బేస్‌లో ఉన్న అమెరికా రీఫుయలింగ్, నిఘా విమానాలపై కూడా ఇరాన్ దాడి చేసింది. శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా దీన్ని స్పష్టంగా అంచనా వేశారు.సుమారు 700 మిలియన్ల డాలర్ల ఖరీదైన ఈ-3 సెంట్రీ నిఘా ప్లేన్‌ను కూడా పేల్చినట్లు గుర్తించారు. కువైట్‌లో ఉన్న అలీ అల్ సలీమ్ ఎయిర్‌బేస్‌తో పాటు క్యాంప్ అరిఫ్‌జాన్‌లో ఉన్న బేస్‌ను కూడా ఇరాన్ టార్గెట్ చేసింది. సైట్ వద్ద ఫ్యూయల్ స్టోరేజ్ బంకర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ హ్యాంగర్లు, ట్రూప్ అకామిడేషన్ ప్రాంతాలు ధ్వంసం అయినట్లు మలార్ శాటిలైట్ చిత్రాల ద్వారా గుర్తించారు.

## చైనాకు 2,700 టన్నుల బియ్యం ఎగుమతి

- ఐదేళ్ల తర్వాత రికార్డ్?

**టి మీడియా, జూన్ 1, అమరావతి బ్యూరో:**



2,700 టన్నుల బియ్యాన్ని ఆంధ్రప్రదేశ్? నుంచి, చెన్నై పోర్టుకు ఎగుమతి చేసినట్లు ఐసీడీ అధికారులు ఎక్స్? ద్వారా తెలిపారు. గత నాలుగైదు ఏళ్లలో ఎప్పుడూ జరగని విధంగా ఈ ఏడు మళ్లీ ఇలా జరగడం ఒక రికార్డ్?గా మారింది. దీంతో దాదాపు ఐదేళ్ల తర్వాత తండియార్‌పేట్‌లోని కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపో లో బీసీఎన్? వ్యాగన్‌ల ద్వారా ఎగుమతి సరుకుల నిర్వహణ పునఃప్రారంభించినట్లు స్పష్టంగా తెలుస్తుంది.

### రవాణా వివరాలు

ఆంధ్రప్రదేశ్‌లోని సామర్లకోట, తణుకులోని కేంద్రాల వద్ద 105 టీఈయూ కంటైనర్ల ద్వారా రవాణా చేశారు. 42 వ్యాగన్లలోకి ఎక్కించిన ఈ బియ్యాన్ని 573 కిలోమీటర్ల దూరం ప్రయాణించి తండియార్‌పేట్ డిపోకు తరలించారు. అక్కడ ఆ బియ్యాన్ని కంటైనర్లలోకి మార్చి, ఆపై చెన్నై పోర్టుకు సంబంధించిన ఒక ప్రత్యేక నౌక ద్వారా బియ్యాన్ని చైనాకు రవాణా చేశారు. గత నాలుగైదు సంవత్సరాలలో ఇంత భారీ స్థాయిలో బియ్యం ఎగుమతులు జరగలేదని తండియార్‌పేట్ ఐసీడీ అధికారులు వెల్లడించారు.

### బహుళ రవాణా సామర్థ్యం

ఆహార భద్రతా చర్యలలో భాగంగా, 2022-23 కాలంలో భారతదేశం నుంచి చైనాకు భారీ ఎత్తున బియ్యం ఎగుమతిని నిషేధించారు. ఆ తర్వాత వరి సాగు విస్తీర్ణం పెరగడం, బియ్యం నిల్వలు మిగులు ఉండటంతో కేంద్ర ప్రభుత్వం 2025 నుంచి ఎగుమతులపై ఆంక్షలను క్రమంగా సడలించడం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో చైనా వ్యాపారులు ఆంధ్రప్రదేశ్‌లోని బియ్యం ఎగుమతి ఏజెంట్లతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. లాజిస్టిక్స్, రవాణా బాధ్యత తమకే అప్పగించినట్లు కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఇన్‌ల్యాండ్ కంటైనర్ అధికారులు తెలిపారు.

### ఈ పద్ధతి ద్వారా రవాణా ఖర్చులు ఆదా

సామర్లకోట-తణుకు వద్ద బియ్యం లోడింగ్ చేయడం చెన్నై మీదుగా రవాణా చేయడం, చివరగా చైనాకు నౌక ద్వారా పంపడం ఈ మొత్తం ప్రక్రియను ఒక్క రోజులోనే పూర్తి చేయడం ఒక రికార్డు విజయమని వారు ప్రత్యేకంగా ప్రస్తావించారు. రహదారి మార్గం ద్వారా కాకుండా రైలు వ్యాగన్ల ద్వారా బియ్యం రవాణా చేయడం వల్ల రవాణా ఖర్చులలో 40% ఆదా అయినట్లు వారు వివరించారు. విశాఖపట్నం పోర్టులో ఎగుమతి ఛార్జీలు అధికంగా ఉండటం, దానికి తోడు తగినన్ని కంటైనర్లు అందుబాటులో లేకపోవడంతో తాము చెన్నై పోర్టును ఎంచుకుంటున్నట్లు ఏజెంట్లు తెలిపారు. అధికారులు తెలిపారు.

# తీర్మానాలు చేశాం - ఆమోదం తెలపండి'

- సీఈఓలపై జడ్పీ ఛైర్మన్ల ఒత్తిడి

**టి మీడియా, జూన్ 1, అమరావతి బ్యూరో :**



కరవమంటే కప్పకు కోపం విడవమంటే పాముకు కోపం అన్న చందంగా తయారైంది రాష్ట్రంలో జడ్పీ సీఈఓల పరిస్థితి. నాలుగు నెలల్లో పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. దీంతో రూ.150 కోట్లతో కొత్త పనులకు సీఈఓలపై జడ్పీ ఛైర్మన్లు ఒత్తిడి తీసుకొస్తున్నారు. 'తీర్మానం చేశాం ఆమోదించండి' అంటూ పట్టుబడుతున్నారు. నిధుల లేమితో దస్త్రాలను పక్కనపెట్టిన అధికారులు, అనుమతులకు అంగీకారం తెలిపేందుకు సతమతమవుతున్నారు..రాష్ట్రంలో జడ్పీ ఛైర్మన్ల పదవీకాలం మరో నాలుగు నెలలు ఉంది. దీంతో భారీగా కొత్త పనుల మంజూరుకు పలు జిల్లాల్లో అధికారులపై వీరు ఒత్తిడి పెంచుతున్నారు. పాలకవర్గం ఆమోదం తెలిపిన పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేయాల్సిందేనని పట్టుబడుతున్నారు. మరోవైపు నిధుల లభ్యత అంతంతమాత్రంగా ఉండటంతో అధికారులు ఏమీతోచని స్థితిలో ఉన్నారు.ఉమ్మడి 13 జిల్లాల జడ్పీ ఛైర్మన్ల పదవీకాలం సెప్టెంబర్? వరకు ఉంది. దీంతో వెళ్లిపోయేముందు రూ.150 కోట్లకుపైగా సాధారణ నిధులతో కాలువలు, భవనాలు, రోడ్లు ఇతరత్రా పనులు చేపట్టేందుకు పలు జిల్లాల్లో ఛైర్మన్లు పాలకవర్గం నుంచి ఆమోదం తీసుకున్నారు. జిల్లాల్లో ఇప్పటికేరూ.450 కోట్లకు పైగా పనులు మంజూరు చేయగా ఇవి వివిధ దశల్లో ఉన్నాయి. వీటిలో సగానికి పైగా పనులు మరో రెండు, మూడు నెలల్లో పూర్తవుతాయి. ఇందుకు వీటికి బిల్లులు చెల్లించాలి. ఈ క్రమంలో మళ్లీ కొత్త పనులు మంజూరు చేయాలంటే అధికారులు భయపడుతున్నారు. ముఖ్యంగా ఈ సమస్య విజయనగరం, గుంటూరు, కర్నూలు, పశ్చిమగోదావరి తదితర జిల్లాల్లో ఉంది. ప్రభుత్వం? ఆమోదించిన వార్షిక బడ్జెట్‌కు లోబడి పనులు మంజూరు చేయాలన్నది జిల్లా పరిషత్?లకు నిబంధన. చాలా జిల్లాల్లో పన్నులు, పన్నేతర ఆదాయం జిల్లా పరిషత్?లకు కనిష్ఠంగా పదిహేను కోట్ల రూపాయల నుంచి గరిష్ఠంగా ఇరవై ఐదు కోట్ల వరకు వస్తోంది. నిధుల ఖర్చులో రోడ్లు, కాలువలు, ఇతర నిర్మాణాలకే పాలకవర్గాలు అధిక ప్రాధాన్యత ఇస్తుంటాయి. పదవీకాలం పూర్తి కావస్తుడటంతో పరిమితికి మించి పనుల మంజూరుకు పాలకవర్గాలు తీర్మానాలు చేస్తున్నాయి. వీటికి పరిపాలన అనుమతులివ్వడం ద్వారా సీఈఓలు ఇరుకున పడే ప్రమాదం ఉంది.పశ్చిమగోదావరి జిల్లాలో రూ.8 కోట్ల అదనపు పనులకు అక్కడి సీఈఓపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. ఇదే జిల్లాలో ఇప్పటికే మంజూరుచేసిన ఆరవై నాలుగు కోట్ల రూపాయల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. కర్నూలు జిల్లాలో కొత్తగా 138 పనులను రూ.4.50 కోట్లతో చేపట్టేందుకు పాలకవర్గం ప్రతిపాదిస్తోంది. గుంటూరు జిల్లాలో రూ.23 కోట్ల పనుల కోసం తీవ్రమైన ఒత్తిడి పెంచుతున్నారు. విజయనగరం జిల్లాలోనూ కొత్త పనులు ప్రతిపాదిస్తున్నారు.కృష్ణా జిల్లా సీఈఓది రూటే సేపరెట్?. నిధుల లభ్యత తక్కువగా ఉందని గతంలో పనులను పెండింగ్?లో పెట్టారు. కానీ ప్రస్తుత సీఈఓ బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజుల్లోనే వీటికి అనుమతులు మంజూరు చేశారు. రూ.12.74 కోట్లతో 205 కాలువలు, రోడ్లు, ఇతరత్రా పనులకు జడ్పీ పాలకవర్గం చేసిన తీర్మానంపై గత జడ్పీ సీఈఓ అభ్యంతరం తెలిపి పక్కన పెట్టారు. నిధుల లభ్యత లేనందున అనుమతి సాధ్యం కాదన్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన సీఈఓ అరుణ గతంలో నిలిపివేసిన 205 పనుల్లోంచి 167 పనులు రూ.11.13 కోట్లతో చేపట్టేందుకు అనుమతులిచ్చారు. సంవత్సరమైనా 38 పనులు పూర్తిగా ప్రారంభం కాలేదని, మిగిలిన 167 పనులు మొదలైనట్లు చూపించి ఇటీవల అనుమతులు ఇచ్చారు. క్షేత్రస్థాయిలో పరిశీలించగా చాలా పనులు అసలు ప్రారంభం కాకపోవడం గమనార్హం.

## హైదరాబాద్‌లో పవన్‌కల్యాణ్ సభ

- అనుమతి నిరాకరించిన పోలీసులు

**టి మీడియా, జూన్ 1 ,హైదరాబాద్ బ్యూరో:**



తెలంగాణ రాష్ట్ర రాజధాని ఐటీ హబ్ గచ్చిబౌలిలో జనసేన పార్టీ నిర్వహించ తలపెట్టిన 'తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ - జనసేన సాధక్ సమ్మేళనం' పేరుతో నిర్వహించే కార్యక్రమానికి భద్రతా కారణాల దృష్ట్యా సైబరాబాద్ పోలీసులు అనుమతి నిరాకరించారు. జూన్ 2వ తేదీన గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్‌లో ఈ సమావేశాన్ని నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధమవగా, చివరి నిమిషంలో పోలీసుల నుంచి ఎదురైన ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### అనుమతి ఇవ్వలేం

జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ ఈ సభ నిర్వహణకు అనుమతి కోరుతూ పోలీసులకు దరఖాస్తు చేసుకున్నారు. జూన్ 2న మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సుమారు 2,000 మంది ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఈ అంతర్గత సమావేశాన్ని నిర్వహించాలని పార్టీ భావించింది. అయితే, ఈ విజ్ఞప్తిని పరిశీలించిన శేరిలింగంపల్లి జోన్ డీసీపీ శ్రీనివాస్ సభకు అనుమతి ఇవ్వడం కుదరదంటూ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు.

### అక్కడి కేసులతో ఇక్కడ సమస్యలు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ వ్యాఖ్యలపై నమోదైన కేసులు, వాటి కారణంగా తెలంగాణలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులు, అలాగే కొందరు ఆంధ్రప్రదేశ్

మిగతా 3లో..

## పరిశ్రమలు పన్నులు చెల్లించకపోతే ఎలా?

- ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆగ్రహం

**టి మీడియా, జూన్ 1, అమరావతి బ్యూరో :**



పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీల పన్నుల వసూళ్లపై అధికారులతో సమీక్షిస్తున్నారు. పరిశ్రమలు, ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి పన్ను వసూళ్లు ఎందుకు సరిగా ఉండటం లేదని అధికారులను అడిగారు. రాజధాని నుంచి ఉన్నతాధికారులతో కలిసి పవన్ నిర్వహించిన సమీక్షలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల అధికారులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. తమ ప్రాంతాల్లో పన్ను వసూళ్లు వివరాలను పంచుకున్నారు.

**పన్ను చెల్లించకపోవడంపై పవన్ ఆగ్రహం**

పరిశ్రమలు, పంచాయతీలకు పన్ను చెల్లించకపోవడంపై పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లాభాలు సంపాదించే పరిశ్రమలు పన్నులు చెల్లించకపోతే ఎలాగని అధికారులను ప్రశ్నించారు. గ్రామాల్లో వనరులు వాడుకుంటూ పన్నులు కట్టకపోవడమేంటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆంధ్రా పేపర్ మిల్స్ రూ.19 కోట్లు బకాయిలు పెట్టిందని గుర్తు చేశారు. విద్యాసంస్థలు కూడా భారీగా పన్ను బకాయిలున్నాయన్నారు. రాష్ట్రంలో పంచాయతీ పన్నులు వసూలైతే రూ.5,400 కోట్లకుపైగా వస్తాయని వివరించారు.

**పన్నుల వసూళ్లలో అధికారులకు దిశానిర్దేశం**

పన్నులు చెల్లించని కారణంగా ఫిల్టర్ బెడ్ల మరమ్మతులకు కూడా ఇబ్బందులు తలెత్తాయన్నారు. పేదలు, కులవృత్తులవారు, చిరుద్యోగులు కూడా పన్నులు చెల్లిస్తున్నారన్నారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు పన్నులు కట్టని విషయం ప్రజలకు తెలియదన్నారు. రాజకీయ ఒత్తిళ్లు ఉన్నా పన్నుల విషయంలో ముందుకెళ్లాలని అధికారులకు పవన్ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై సీఎంతో పాటు మంత్రివర్గంతోనూ మాట్లాడతానని పవన్ అధికారులతో చెప్పారు. పల్స్ సర్వే తరహాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పన్నుల వసూళ్ల కార్యాచరణ చేప్టటాలని అధికార యంత్రాంగానికి ఈ సందర్భంగా పవన్ దిశానిర్దేశం చేశారు.

**దేశంలో ఏపీ స్థానం ఎక్కడంటే?**

ఈ ఏడాది ప్రకటించిన జాతీయ పంచాయతీ అవార్డుల్లో ఏపీ అత్యుత్తమ పనితీరు కనబరిచింది. మొత్తం ఆరు అవార్డులు సాధించిన కర్ణాటక రాష్ట్రం దేశంలోనే తొలి స్థానంలో నిలిచింది. ఐదు అవార్డులు సాధించిన ఆంధ్రప్రదేశ్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. అలాగే, ఒడిశా రాష్ట్రం కూడా ఐదు అవార్డులతో ఏపీతో పాటు సంయుక్తంగా రెండో స్థానాన్ని పంచుకుంది.

**జూన్ 3న ఢిల్లీలో వేడుక**

దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పురస్కార్ కింద దేశవ్యాప్తంగా మొత్తం 34 గ్రామ పంచాయతీలకు కేంద్రం ర్యాంకులు ఇచ్చింది. వీటికి రూ. 25 లక్షల నుంచి కోటి రూపాయల వరకు నగదు బహుమతులు అందుతాయి. అలాగే, నానాజీ దేశ్‌ముఖ్ పురస్కార్ కింద దేశవ్యాప్తంగా 8 బ్లాక్ పంచాయతీలను ఎంపిక చేసి, రూ.50 లక్షల నుంచి రూ.5 కోట్ల వరకు నగదు ఇవ్వనున్నారు. ఈ జాతీయ అవార్డుల ప్రదాన కార్యక్రమాన్ని వచ్చే నెల (జూన్) 3వ తేదీన దేశ రాజధాని ఢిల్లీలో అట్టహాసంగా నిర్వహించనున్నారు. అవార్డులు సాధించిన పల్లెల సర్పంచులు, అధికారులు ఆ వేదికపై ఈ పురస్కారాలను అందుకోనున్నారు. ఈ ఘనత సాధించడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# దశాబ్దాల పోరాటానికి దక్కిన ఫలితం

- అధికారికంగా అమల్లోకి దక్షిణ కోస్తా రైల్వే జోన్

**టి మీడియా, జూన్ 1, అమరావతి బ్యూరో :**

మన రైళ్లు, మన లైన్లు మనమే నిర్ణయించుకునేలా దశాబ్దాల నాటి కల సాకారమైంది. విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఆవిర్భవించింది. జోన్ సాధన కోసం ప్రతి ఒక్కరూ సాయుధంగా మారి ఏళ్లుగా చేసిన పోరాటం ఫలించింది. తాత్కాలిక కార్యాలయంలో జోన్ కార్యకలాపాలు ప్రారంభంతో రాష్ట్ర ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూసిన చిరకాల స్వప్నం కూటమి ప్రభుత్వ పాలనలో ఆవిష్కృతమైంది.

జెండాలు వేరైనా ఒకటే అజెండాగా

విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు కోసం పార్టీలకతీతంగా జెండాలు వేరైనా ఒకటే అజెండాగా దశాబ్దాల ఉత్తరాంధ్ర నేతలు చేసిన పోరాటం విజయం సాధించింది. ఎర్రన్నాయుడు, వీఎూ మూర్తి, భాట్టం శ్రీరామ్మూర్తి, పల్లా సింహాచలం,పెతకంశెట్టి అప్పల నరసింహం, ద్రోణంరాజు శ్రీనివాసరావు వంటి నేతలు జోన్ సాధన కోసం పోరాటం చేశారు. తమ తర్వాత తరాలకు రైల్వే ప్రయాణాల కష్టాలు ఉండకూడదని ఆశపడ్డారు.ఎర్రన్నాయుడు కుమారుడు రామ్మోహన్ నాయుడు కేంద్రమంత్రిగా, ఎం వీ ఎస్ ఎస్ మూర్తి మనవడు భరత్ ఎంపీగా, పల్లా సింహాచలం కుమారుడు పల్లా శ్రీనివాస్ గాజువాక ఎమ్మెల్యేగా, బీజేపీ నేత పి.వి చలపతిరావు కుమారుడు మాధవ్ బీజేపీ అధ్యక్షుడిగా, పెతకంశెట్టి అప్పల నరసింహం కుమారుడు పి వి జి ఆర్ గణబాబు ప్రభుత్వ విప్‌గా ఉన్న సమయంలో వారి తండ్రులు కన్న కల ఇప్పుడు నెరవేరింది.



**4 డివిజన్లతో కార్యాకలాపాలు ప్రారంభం**

18వ రైల్వే జోన్‌గా దక్షిణ కోస్తా రైల్వే జోన్ అధికారికంగా అమల్లోకి వచ్చింది. 4 డివిజన్లతో కార్యాకలాపాలను ప్రారంభించింది. నూతన ప్రయాణంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న వాల్తేరు డివిజన్ విశాఖ డివిజన్‌గా రూపాంతరం చెందింది. జోనల్ మేనేజర్‌గా సందీప్ మాధుర్ డీఆర్ఎంగా లలిత్ బొహరా సారథ్యం వహిస్తున్నారు. జోన్ ఏర్పాటుతో ఉద్యోగార్థుల కష్టాలు తీరుతాయని స్థానికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని కార్మిక సంఘ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఏటా రూ.15,500 కోట్ల ఆదాయం**

జోన్ పరిధిలోకి 385 స్టేషన్లలో 62 వేల మంది ఉద్యోగులు విధుల నిర్వహించనున్నారు. ప్రాథమికంగా సుమారు 100 వరకు రైళ్లు సేవలు అందించనున్నాయి. ఏటా 100 మిలియన్ టన్నుల సరకు రవాణా జరగనుంది. రాష్ట్రంలో ఉన్న పోర్టులు, పరిశ్రమల ద్వారా సరకు రవాణా మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం 6 పోర్టులు భవిష్యత్‌లో మరో ఐదు పోర్టులు జోన్ పరిధిలోకి రానున్నాయి. సరకు రవాణా, ప్రయాణికుల ద్వారా ఏటా రూ.15,500 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా. రాష్ట్రంలో పలుచోట్ల ఉన్న లోకో షెడ్లు, కోచ్ వర్క్ షాపులు, నిర్వహణ డిపోలు, వ్యాగన్ల వర్క్ షాపులతో దక్షిణ కోస్తా జోన్ బలోపేతం కానుందని స్థానిక నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## గర్భిణి అయిన భార్య కోసం

### గవర్నర్ కాన్వాయ్‌ని అడ్డగించిన వ్యక్తి

**టి మీడియా, జూన్ 1, బెంగళూరు :**

రాజకీయ ప్రముఖులు , వీవీఐపీల కాన్వాయ్ రోడ్డుపై వెళ్లే సమయంలో భద్రతా కారణాల రీత్యా ఆ దారిలో ట్రాఫిక్‌ను నిలిపివేయడం సహజం. దాంతో రద్దీ సమయాల్లో ప్రజలు ఒకింత ఇబ్బందులకు గురవుతుంటారు. బెంగళూరు లో ఇదే తరహా ఘటన చోటుచేసుకుంది. కర్ణాటక గవర్నర్ కాన్వాయ్ ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్డు వైపు వెళ్తుండటంతో పోలీసులు ఆ మార్గంలో దాదాపు 30 నిమిషాల పాటు ట్రాఫిక్‌ను నిలిపిశారు. దాంతో ఓ వ్యక్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.గర్భవతిగా ఉన్న తన భార్యను అత్యవసర చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా ట్రాఫిక్ నిలిపివేయడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ ధర్నాకు దిగారు. గవర్నర్ కాన్వాయ్ వచ్చే మార్గంలో బైఠాయించారు. అండర్‌పాస్ నిర్మాణ పనుల కారణంగా ఓల్డ్ ఎయిర్‌పోర్ట్ రోడ్డు మార్గం ఇప్పటికే రద్దీగా ఉందని, ఈ విధంగా గంటల తరబడి ట్రాఫిక్‌ను నిలిపివేస్తే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ఆయన పోలీసులను ప్రశ్నించారు. తన భార్య గర్భవతి అని, అత్యవసర వైద్య పరిస్థితి కంటే వీఐపీ కాన్వాయ్‌లకే ప్రాధాన్యమిస్తారా..? అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.ట్రాఫిక్ క్లియర్ చేసేవరకు రోడ్డుపై నుంచి కదలనని అతను కరాఖండిగా చెప్పడంతో పోలీసులు ఓ వైపు నుంచి వాహనాలను క్లియర్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో వీఐపీ కల్చర్‌పై నెటిజన్లు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. 'వీఐపీల సౌకర్యాలకు ఇచ్చే విలువ ప్రజల ప్రాణాలకు లేకుండా పోతోంది' అంటూ మండిపడ్డారు.



# పది రోజుల్లో నైరుతి రుతుపవనాలు..

- మోస్తరు వర్షాలు

**టి మీడియా, జూన్ 1 ,హైదరాబాద్ బ్యూరో :**

రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు పదిరోజుల్లో ప్రవేశించనున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ రుతుపవనాలు జూన్ 10 నుంచి 12 తేదీల మధ్య రాష్ట్రాన్ని తాకే అవకాశం ఉన్నదని అంచనా వేస్తున్నది. వచ్చే నాలుగైదు రోజుల్లో కేరళతో పాటు తమిళనాడులోని పలు ప్రాంతాలు రుతుపవనాల ప్రవేశానికి అనుకూల పరిస్థితులు ఉన్నట్లు వెల్లడించింది.వచ్చే నాలుగు రోజులు క్రమంగా 2 నుంచి 3 డిగ్రీల మేర గరిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుతాయని అధికారులు తెలిపారు. జూన్ మొదటి వారంలో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని స్పష్టం చేశారు. కాగా నిరుటితో పోలిస్తే రాష్ట్రవ్యాప్తంగా 8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది.రాష్ట్రంలోని మంచిర్యాల, పెద్దపల్లి, ములుగు, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఆదివారం 45 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు వాతావరణశాఖ తెలిపింది. 22 జిల్లాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలో అత్యధికంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో 45.4 డిగ్రీలు నమోదైనట్టు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో 41.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భానుడి ప్రతాపంతో నిప్పుల కుంపటిగా ఉన్న రాష్ట్రం ఒక్కసారిగా వాతావరణం సాయంత్రం మారింది. ఆదిలాబాద్ జిల్లా రైతులు మార్కెట్ యార్డులో పోసిన జొన్నలు తడిసి ముద్దయ్యాయి. మంచిర్యాల జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి ధాన్యం కొట్టుకుపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



# 'సీబీఎస్ఈ కార్యాలయంలో జేబు దొంగలు'..

- కేంద్ర ప్రభుత్వంపై రాహుల్‌గాంధీ ఆగ్రహం

**టి మీడియా, జూన్ 1, ఢిల్లీ బ్యూరో**

: సీబీఎస్ఈ కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్-స్క్రీన్ మార్కింగ్ మూల్యాంకన ప్రక్రియలో లోపాలపై దేశవ్యాప్తంగా విమర్శలు వస్తున్నాయి. ఈ వ్యవహారానికి సంబంధించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి కేంద్ర సర్కారు పై, సీబీఎస్ఈ పై ఆగ్రహం వ్యక్తంచేశారు. మూల్యాంకన ప్రక్రియలో చేసిన తప్పుల నుంచి సీబీఎస్ఈ లాభపడుతోందని ఆరోపించారు. ఈ మేరకు ఆయన విద్యార్థులతో ముచ్చటించిన వీడియోను సోమవారం ఎక్స్ వేదికగా షేర్ చేశారు.ఆ వీడియోలో ఏముందంటే.. 'జేబుదొంగలు ఉన్నారు జాగ్రత్త. వారు సీబీఎస్ఈ కార్యాలయంలో తిష్ట వేశారు. సీబీఎస్ఈ పొరపాటు వల్ల మార్కులు తప్పుగా వస్తే.. దానికి బిల్లు మీపై పడుతుంది. అదెలాగంటే.. డిజిటల్ స్కాన్ కాపీ తీసుకోవాలంటే ఒక సబ్జెక్టుకు రూ.100, ఒక పేపర్ రీటోటలింగ్‌కు రూ.100, రీ-ఎవాల్యుయేషన్ చేయించుకోవాలంటే ఒక ప్రశ్నకు రూ.25, మొత్తంగా ఒక విద్యార్థి తన జవాబుపత్రాన్ని సరిగా దిద్దించుకోవడానికి దాదాపు రూ.2000 చెల్లించాల్సి రావొచ్చు. నాలుగు లక్షల మంది విద్యార్థులు దీనికోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు.. సీబీఎస్ఈ ఎంత సొమ్ము ఆర్జిస్తోందో గమనించాలి. ఫోన్‌తో స్కాన్ చేస్తే తప్పులు రావడం ఖాయం. వాటిని సరిచేయడానికి అయ్యే ఖర్చు విద్యార్థులే చెల్లించాలి. తప్పు సీబీఎస్ఈది.. శిక్ష పడుతున్నది విద్యార్థులకు.. ఆదాయమేమో ప్రభుత్వానికి..! విద్య ఒక వ్యాపారంగా మారితే తప్పులు సరికాకపోగా రెట్టింపు అవుతాయి. సమయం, ఆత్మవిశ్వాసం, భవిష్యత్తు రూపంలో విద్యార్థులు మూల్యం చెల్లించుకుంటున్నారు' అని రాహుల్ గాంధీ విమర్శలు చేశారు.




సీబీఎస్ఈ టెండర్ నిబంధనలను మార్చేసిన ఫలితమే ఇదీ అని రాహుల్‌గాంధీ గతంలో కూడా విమర్శించారు. వాస్తవానికి 300 డీపీఐతో ఆటోమేటిక్ రోబోటిక్ స్కానర్లను పరీక్ష పత్రాల స్కానింగ్‌కు వినియోగించాల్సి ఉండగా.. ఆన్సర్ షీట్లను మొబైల్ ఫోన్ సాయంతో స్కాన్ చేసి తప్పిదాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనివల్ల విద్యార్థులు బాధితులుగా మారారని ఆందోళన వ్యక్తంచేశారు. కాగా పరీక్షల నిర్వహణలో యంత్రాంగం వైఫల్యం.. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలవరపరుస్తోంది. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటన మరవకముందే కొద్ది రోజులుగా సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాల వివాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అవుతోంది.

## సమస్యల పరిష్కారమే బీసీ పొలిటికల్ జెఎసి

- జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటుగా మహేందర్ నాయుడు

**టీ మీడియా, జూన్ 1, వనపర్తి బ్యూరో :**



ప్రజా సమస్యల పరిష్కారమే తమ ఎజెండాగా భావించి బీసీ పొలిటికల్ జేఏసీ ముందుకు సాగుతుందని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ స్పష్టం చేశారు.సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు కార్యక్రమంలో మదనాపురం మండలం అజ్జకొల్లు గ్రామానికి చెందిన బి.మహేందర్ నాయుడును బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటుగా రాచాల నియమించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నేడు మదనపురం మండలంలో ప్రజలకు ఏ సమస్య వచ్చినా మహేందర్ నాయుడు ముందుండి ప్రజల పక్షాన పోరాటం సాగిస్తున్నాడని, ఆయన సేవలు ఒక మండలానికి పరిమితం కాకుండా జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటుగా నియమిస్తున్నట్లు తెలిపారు. గత దశాబ్ద కాలంగా బీసీ పొలిటికల్ జేఏసీ నిర్వహిస్తున్న అనేక ఉద్యమాలలో మహేందర్ నాయుడు చురుకైన పాత్ర పోషించాడని అన్నారు.

దశాబ్ద కాలంగా బీసీ పొలిటికల్ జేఏసీకి ఏ విధంగా సహకరించారో మహేందర్ నాయుడుకు కూడా అదేవిధంగా ప్రోత్సహించి వెన్ను తట్టి నిలవాలని ప్రజలకు, బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులకు, మీడియాకు విజ్ఞప్తి చేశారు. అన్ని ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి ప్రతిపక్ష పాత్ర పోషించడమే కాకుండా రాష్ట్రస్థాయిలో అవినీతికి పాల్పడుతున్న అధికారుల భరతం పట్టడంలో కూడా ముందు నిలుస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్ నాయకులు బాలవర్ధన్, రాములు, కురుమూర్తి, ఉదయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన నూతన కమిషనర్

**టీ మీడియా, జూన్ 1, ఆత్మకూరు:**



వనపర్తి జిల్లా ఆత్మకూర్ మున్సిపాలిటీ నూతన మున్సిపల్ కమిషనర్‌గా ఎ. నరేష్ కుమార్ నేడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అధికారులు,సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కమిషనర్ మున్సిపాలిటీ పరిధిలో అమలవుతున్న అభివృద్ధి పనులు, పారిశుద్ధ్య కార్యక్రమాలు, పన్నుల వసూళ్లు, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ గమాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన పౌర సేవలు అందించడం, పారదర్శక పాలనను కొనసాగించడం మరియు పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం తన లక్ష్యమని తెలిపారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, ట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బీడీ కార్మికులకు జీవనభృతి పెన్షన్లు ఇవ్వాలి

- ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్

**టీ మీడియా ,జూన్ 1 ,ఆత్మకూరు:**



వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం లోని బీడీ పనిపై ఆధారపడి జీవిస్తున్న బీడీ కార్మికులకు జీవన భృతి పెన్షన్ లు గత ప్రభుత్వం పూర్తిగా బీడీ చేసే వారందరికీ ఇవ్వకుండా కొంతమంది కి మాత్రమే ఇచ్చి మిగతా వారికీ ఇప్పుడు అప్పుడు అంటు బీడీ కార్మికుల పెన్షన్ లాగిన్ లాక్ చేసి కాలం గడిపారు తర్వాత అధికారం లోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న పెన్షన్ లు పెంచుతామాని, కొత్త పెన్షన్ లు ఇస్తామని చెప్పి రెండు సంవత్సరాల 6 నెలలు దాటింది ఇప్పుడు జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కొత్త పెన్షన్ లు బీడీ కార్మికులకు, వికలాంగులకు,విడో, వృద్దుల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోమని అధికారులు ప్రకటన చేశారు. కనుక ఆత్మకూర్ మండలం లోని ప్రధానంగా బీడీ కూలీ పై ఆధారపడి జీవించే గ్రామాలు మూలమళ్ళ, ఖానాపూర్, పిన్నేంచర్ల, ఆత్మకూర్, జూరాల గ్రామాలలో ఉన్న బీడీ కార్మికులకు మొదటి ప్రాధాన్యతగా బీడీ కార్మికులకు పెన్షన్ లు ఇచ్చేటట్లుగా జిల్లా, మండల అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆత్మకూర్ మండల ఎంపీడీవో శ్రీరామ్ రెడ్డి కి కార్మికులతో కలిసి బీడీ కార్మికుల జీవన భృతి దరఖాస్తులు ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమం లో తెలంగాణ ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సి రాజు, కార్మికులు పరిమళ, ప్రభావతి, బేబీ,తిరుపతమ్మ,పావని, జ్యోతి, ఆశాలత, శ్యామల, మాసమ్మ, కిష్టమ్మ, మాసమ్మ ,శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# పైసలిస్తే పవన్ కల్యాణ్ ఏ నటన అయినా చేస్తాడు..

- మంత్రి పొన్నం ప్రభాకర్

**టి మీడియా, జూన్ 1, సిద్దిపేట :**



ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జూన్ 2వ తేదీన తెలంగాణలో నవ నిర్మాణ సభను ఏర్పాటు చేయడంపై మండిపడ్డారు. అణువణువునా తెలంగాణ వ్యతిరేకతను నింపుకున్న పవన్ కల్యాణ్.. ఇప్పుడు తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీజేపీ జెండాను మోస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతనే ఇక్కడ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు.సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ప్రజల కండ్లు పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎండిపోతాయని మాట్లాడిన పవన్ కల్యాణ్ ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని తెలంగాణలో సభలు పెడుతున్నారని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు 11 రోజుల పాటు అన్నం మానేశానని చెప్పిన వ్యక్తి.. అదే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు ఇక్కడికి వచ్చి మొసలి కన్నీరు కారిస్తే ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు.

కూట్లో రాయి తీయలేనోడు ఏట్లో రాయి తీస్తాడటా

ఏపీ ఉప ముఖ్యమంత్రిగా ఏమైనా పీకగలిగితే అక్కడ చేయి.. ఇక్కడికి వచ్చి నవ నిర్మాణ సభ పెడితే ఇక్కడ ఎవడు సహించడానికి సిద్ధంగా లేరుతెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం తినని వెధవ వచ్చి.. ఇక్కడ తెలంగాణ పట్ల మొసలి కన్నీరు కారిస్తే ఒప్పుకోముతెలంగాణ ఏర్పడినప్పుడు వ్యతిరేకించిన వ్యక్తి ఇప్పుడు తెలంగాణపై ప్రేమ చూపించడం రాజకీయ నాటకమేనని పొన్నం ప్రభాకర్ అన్నారు. కన్నతల్లికి గాజులు కొనలేని వాడు.. పినతల్లికి ఒడ్డాణం చేయిస్తాడట అన్నట్లుగా.. ఏపీలో చేయలేనిది.. తెలంగాణకు వచ్చి చేస్తాననడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. పవన్ కల్యాణ్ నవనిర్మాణ సభల వెనుక బీజేపీ రాజకీయ ఎజెండా ఉందని ఆరోపించారు. నవనిర్మాణ సభలను గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, అస్సాం, కేరళ, తమిళనాడులో ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో విద్వేషాలు రెచ్చగొట్టడం, సామాజిక వైషమ్యాలు సృష్టించడమే లక్ష్యంగా బీజేపీ డైరెక్షన్‌లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు.

పవన్ కళ్యాణ్ పైసలు ఇస్తే ఎలాంటి నటన అయినా చేస్తాడు, ఏ డ్రెస్ అంటే ఆ డ్రెస్ వేసుకొని ఎగురుతాడుపవన్ కల్యాణ్‌ను సినిమా హీరోగా అభిమానించవచ్చు.. కానీ రాజకీయాల్లో తెలంగాణ వ్యతిరేక ధోరణితో వస్తే నిలదీస్తామని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. పవన్ కల్యాణ్ సినిమా నటుడు అని అన్నారు. పవన్ కల్యాణ్‌కు పైసలిస్తే ఎలాంటి నటన అయినా చేస్తాడని.. ఏ డ్రెస్ అంటే ఆ డ్రెస్ వేసుకొని ఎగురుతాడని విమర్శించారు. ఇప్పుడు బీజేపీ స్క్రిప్ట్‌కు అనుగుణంగానే నటిస్తున్నాడని అన్నారు. బీజేపీ ఇచ్చే రెమ్యూనరేషన్ కోసం తెలంగాణకు రావడం లేదని.. నువ్వు నమ్మిన దేవుడు కొండగట్టు అంజన్నపై ప్రమాణం చేసి చెప్పగలవా అని పవన్‌కల్యాణ్‌కు సవాలు విసిరారు.విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, గంగవరం, కృష్ణపట్నం పోర్టుల అంశం, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి సమస్యలపై స్పందించకుండా తెలంగాణకు వచ్చి రాజకీయాలు చేయడం ఎందుకు అని పవన్ కల్యాణ్‌ను ప్రశ్నించారు. సినిమాల్లో దేశభక్తిని చూపించడం కాదు.. నిజజీవితంలో ప్రజల కోసం నిలబడాలని హితవు పలికారు. ఏపీ ప్రజలు నీకు అధికారం ఇచ్చారు.. ముందు అక్కడ నవనిర్మాణం చేసి చూపించని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని గాయపరిచేలా మాట్లాడిన పవన్ కల్యాణ్ ముందు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ సమాజం ఆయన రాజకీయ ఉద్దేశాలను అంగీకరించదని స్పష్టం చేశారు.

## ట్యాంక్ సామర్థ్యం 45 లీటర్లు..

- 52 లీటర్లకు పైగా పెట్రోల్ నింపినట్లు బిల్లు


**టి మీడియా, జూన్ 1, లక్నో:**



పెట్రోల్ బంకుల్లో జరుగున్న మోసాన్ని ఒక వ్యక్తి బయటపెట్టాడు. 45 లీటర్ల సామర్థ్యం ఉన్న కారు ట్యాంకులో 52 లీటర్లకుపైగా పెట్రోల్ నింపినట్లు బంకు సిబ్బంది బిల్లు ఇచ్చినట్లు ఆరోపించాడు. దీంతో అధికారులు రంగంలోకి దిగారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో ఈ సంఘటన జరిగింది. చరణ్ సింగ్ ఇటీవలే కొత్త కారును కొనుగోలు చేశాడు. అతడు పెట్రోల్ బంకు వద్దకు వెళ్లాడు. ట్యాంక్‌లో సుమారు ఐదు లీటర్ల పెట్రోల్ మిగిలి ఉన్నట్లు ఫ్యూయల్ ఇండికేటర్ చూపించింది.కాగా, తన కారులో ట్యాంక్ ఫుల్‌గా పెట్రోల్ నింపమని బంకు సిబ్బందిని చరణ్ సింగ్ కోరాడు. ఆ కారు ట్యాంక్ పూర్తి సామర్థ్యం 45 లీటర్లు. అందులో 5 లీటర్ల పెట్రోల్ ఉన్నది. అయినప్పటికీ 52 లీటర్ల పెట్రోల్ నింపినట్లు బంకు సిబ్బంది బిల్లు ఇచ్చాడు. ఇది చూసి కారు యజమాని చరణ్ సింగ్ షాక్ అయ్యాడు. దీని గురించి బంకు సిబ్బందిని నిలదీశాడు.మరోవైపు తొలుత కారు ట్యాంకులో 41 లీటర్ల పెట్రోల్‌ను బంకు సిబ్బంది నింపినట్లు చరణ్ సింగ్ గ్రహించాడు. ఆ తర్వాత మీటర్ రీడింగ్‌ను మార్పు చేసి అదనంగా 11 లీటర్లు నింపినట్లు బిల్లులో చూపినట్లు ఆరోపించాడు. ఈ మోసాన్ని బయటపెట్టేందుకు కారు తయారీ సంస్థ ప్రతినిధిని అక్కడకు పిలిపించాడు.ఆ కారు కంపెనీ ప్రతినిధి ఆ పెట్రోల్ బంకు వద్దకు చేరుకున్నాడు. కారు ట్యాంక్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ 45 లీటర్ల కంటే ఎక్కువ పెట్రోల్ పట్టదని అధికారికంగా ధృవీకరించాడు. దీంతో చరణ్ సింగ్ ఆ పెట్రోల్ బంకుపై అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో మోసపూరిత చిప్‌లు, డిస్పెన్సింగ్ యంత్రాల తనిఖీ కోసం జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

## బ్యాంకు ఏర్పాటు చేయాలి

**టీ మీడియా ,జూన్ 1, ఆత్మకూర్:**



వనపర్తి జిల్లా అమర చింత మండల కేంద్రం లో ప్రజల అవసరాల నిమిత్తం ఎస్బిఐ బ్యాంకు ఏర్పాటు చేయాలని సోమవారం నాడు అమర చింత అఖిలపక్ష పార్టీలు,అమర చింత వాసులుఆధ్వర్యం లో ఆత్మకూరు ఎస్బిఐ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసులు గారికి వినతి పత్రం ఇవ్వడం. అమరచింత మున్సిపాలిటీ మండలకేంద్రం అయినప్పటికీ ఒకే ఇక యూనియన్ బ్యాంకు ఉండడం తో వేల అకౌంట్లు ఉన్నందునప్రతి రోజు ప్రజలు బ్యాంకు కు వెళ్లాలంటే రోజు మొత్తం పనులు వదులు కొని వెళ్లాల్సి వస్తున్నదని వాపోయారుఇదివరకు అధికారులదృష్టికి ఇ సమస్య తెలియజేయడం జరిగిందని వివరించారు..ఈ కార్యక్రమంలోమాజీ కౌన్సిలర్ మంగ లావణ్య ,కో ఆప్షన్ సభ్యులు యస్.అజయ్ ,నర్సింలు గౌడ్ ,జె.రాజన్న ,కె.లక్ష్మీ నారాయణ ,యస్.మస్లమని .ఎ ,రవీందర్ ,మాజీ సర్పంచ్ గోపాల్, ఎ.రఘు,కె.విజయ్,ఎ వెంకటస్వామి, రఫీ,ఫిరోజ్,కవి తిరుమలేశ్.అడ్వొకెట్ ,రామచందర్, రవి కుమార్ లు పాల్గొన్నారు.



### పమ్మి గ్రామంలో ఘనంగా

## ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ మహోత్సవం

**టి మీడియా, జూన్ 1, ముదిగొండ**

ముదిగొండ మండలం పమ్మి గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ గారు , సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ గారు , ముదిగొండ మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపూడి బుచ్చిరామయ్య గారితో పాటు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేసిన నాయకులు, పేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం ప్రజలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# అత్యాధునిక హంగులతో సబర్బన్ స్టేషన్లు

- దక్షిణ మధ్య రైల్వే కసరత్తు

**టి మీడియా, జూన్ 1 ,హైదరాబాద్ బ్యూరో:**
దేశాభివృద్ధిలో భారతీయ రైల్వే కీలక పాత్ర పోషిస్తోంది. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా దేశంలోని రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేసేలా అమృత్ భారత్ స్టేషన్ పథకాన్ని (ఏబీఎస్ఎస్) అమలు చేస్తోంది.అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశంలోని రైల్వే స్టేషన్లను భారతీయ రైల్వే అభివృద్ధి చేస్తోంది. ఇప్పటికే అనేక స్టేషన్ల రూపురేఖలనే మార్చేసింది. రాజధాని నగర పరిధిలోని ప్రధాన రైల్వే స్టేషన్లలో చేపట్టిన పునరాభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే బేగంపేట రైల్వేస్టేషన్‌లో అధునాతన సౌకర్యాలు ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయి. దీనితో పాటు హైటెక్?సిటీ, హఫీజ్?పేట, మల్కాజిగిరి రైల్వే స్టేషన్లలో పనులు దాదాపుగా పూర్తయ్యాయి.

**త్వరలోనే ప్రారంభం**
హైటెక్‌సిటీ, హఫీజ్‌పేటలో 98 శాతం పనులు పూర్తవగా, మల్కాజిగిరి స్టేషన్‌లో 90 శాతం పూర్తయ్యాయి. త్వరలోనే ఈ స్టేషన్లను ప్రారంభించేందుకు దక్షిణ మధ్య రైల్వే కరసత్తు చేస్తోంది. ఇటీవల ప్రధాని మోదీ భాగ్యనగరానికి వచ్చిన సమయంలోనే వీటిని ప్రారంభించాలని భావించారు. అయితే అనివార్య కారణాలతో వాయిదాపడింది. మిగిలిన స్టేషన్లు ఉప్పుగూడ, మేడ్చల్, ఉందానగర్, మలక్‌పేట్, షాద్‌నగర్, యాకుత్‌పురలో ఇప్పటికీ పనులు జరుగుతున్నాయి.

**హైటెక్‌సిటీ రైల్వే స్టేషన్ :** హైదరాబాద్? నగరంలో ఐటీ హబ్‌కు సేవలు అందించే స్టేషన్‌గా మార్చడమే ధ్యేయంగా పునరాభివృద్ధి పనులు చేపట్టారు.

మొత్తం ఖర్చు : దాదాపు రూ. 35.61కోట్లు (ఫేజ్-1 రూ. 25 కోట్లు, ఫేజ్-2 రూ. 10 కోట్లు)
ప్రస్తుత పరిస్థితి : పనులన్నీ దాదాపుగా పూర్తయ్యాయి.
రోజు వారీ ప్రయాణికుల సంఖ్య : 6,000
ఎంఎంటీఎస్, సబర్బన్ రైళ్లు : 60 కి పైగా అందుబాటులో ఉన్నాయి. వారాంతాల్లో వీటి సంఖ్య అధికంగా ఉంటుంది.
పూర్తయిన పనులు : స్టేషన్ భవన నిర్మాణం, దివ్యాంగులకు సౌకర్యాలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, 12 మీటర్ల వెడల్పు ఫుట్ ఓవర్ బ్రిడ్జి (ర్యాంప్‌తో), అదనపు ప్లాట్‌ఫామ్ షెల్టర్, ఆధునిక టాయిలెట్లు.

**హఫీజ్‌పేట స్టేషన్**
హఫీజ్‌పేట రైల్వేస్టేషన్ అత్యాధునిక సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి మెరుగైన వసతులు కల్పించడమే ధ్యేయంగా సుమారు రూ. 31 కోట్ల వ్యయంతో ఇక్కడ పునరాభివృద్ధి పనులు చేపట్టారు. ఈ పనులు దాదాపు పూర్తయ్యాయి. త్వరలోనే ఈ స్టేషన్‌ను ప్రారంభించనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి 'ఎక్స్' వేదికగా వెల్లడించారు.
ప్రాజెక్టు వ్యయం - రూ. 31 కోట్లు.వర్గీకరణ - సబర్బన్? గ్రేడ్? - 3.రోజు వారీ ప్రయాణికుల సంఖ్య - దాదాపు 10,000.స్టేషన్?లో నిలిచే ఎంఎంటీఎస్? రైళ్ల సంఖ్య - 60.స్టేషన్?లో ఆగే ఎక్స్?ప్రెస్? రైళ్ల సంఖ్య - 8.
పూర్తయిన పనులివీ
ప్లాట్‌ఫామ్ పైకప్పు, స్టేషన్ భవనం పనులు, ప్లాట్‌ఫామ్‌పై కవరింగ్, ఆధునిక టాయిలెట్లు, సైన్ బోర్డులు, లిఫ్టులు 2, ఎస్కలేటర్లు 2, సర్క్యులేటింగ్ ఏరియా, 12 మీటర్ల వెడల్పుతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి(ర్యాంప్‌తో), స్టేషన్ భవనం, ప్లాట్‌ఫామ్ పునర్నిర్మాణం.



మల్కాజిగిరి రైల్వే స్టేషన్
హైదరాబాద్? నగరానికి తూర్పున ఉన్న మల్కాజిగిరి స్టేషన్ పునరాభివృద్ధి పనులు సుమారుగా 90 శాతం పూర్తయ్యాయి. మరికొన్ని రోజుల్లోనే ప్రధాన ముఖద్వారంతో పాటు స్టేషన్? విస్తరణ పనులు పూర్తి కానున్నాయి. ఇక్కడ ప్రత్యేక విశ్రాంతి గదులు, ఇతర సౌకర్యాలు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ స్టేషన్?లో సబర్బన్? రైళ్లతో పాటు దూర ప్రాంత రైళ్లకు హాల్టింగ్? సదుపాయం ఉంది.
ప్రాజెక్టు వ్యయం - రూ. 27.61 కోట్లు
గ్రేడ్? - సబర్బన్? గ్రేడ్?-3
రోజువారీ ప్రయాణికుల సంఖ్య - 3,000 మంది
ప్రతి రోజూ ఇక్కడ ఆగే రైళ్ల సంఖ్య - 27 జతలు

# ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభం



**టీ మీడియా, జూన్ 1, పెబ్బేరు:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వనపర్తి ఎమ్మెల్యే తూడి మెఘారెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు పథకం ప్రారంభోత్సవ వేడుకలు వనపర్తి నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో జరిగాయి పెబ్బేరు మండలం తోమాలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఐదు ఇందిరమ్మ ఇండ్లను గ్రామ సర్పంచ్ అశోక్ కుమార్ మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఘనంగా ప్రారంభించారు ఈ సందర్భంగా లబ్ధిదారుల సమక్షంలో రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేయించారు అనంతరం మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింపజేస్తామని దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నారన్నారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వీరేష్ కుమార్ మార్కెట్ డైరెక్టర్లు రామన్ గౌడ్ మోతే రాములు గ్రామ మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ బుర్రమోని రాములు యాదవ్ వార్డు సభ్యులు ఉమేష్ గౌడ్ గట్టమ్మ,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసులు మాజీ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రంగన్న యాదవ్ మాజీ సింగల్ విండో వైస్ చైర్మన్ మహదేవుడు రమేష్ అశోక్ రాముడు మహిళా సంఘం సభ్యులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.తమకు సొంతింటి భాగ్యం కల్పించినందుకు లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనపర్తి ఎమ్మెల్యే తూడి మెఘారెడ్డికి స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## చెత్త వాహనం నడిపిన గ్రామ సర్పంచ్

**టి మీడియా, జూన్ 1, పెబ్బేరు :**




పెబ్బేరు మండలంలోని యాపర్ల గ్రామంలో గ్రామ పంచాయతీ పారిశుధ్య వాహన చోదకుడు విధులకు గైర్హాజరు అయ్యాడు విషయం తెలుసుకొన్న సర్పంచ్ స్వరాజ్యం బాబు గ్రామ పరిసరాలు ఇండ్లల్లోని చెత్త రెండు రోజులుగా అపరిశుభ్రంగా వుంటుందని అలాగే గ్రామ సమస్యలపై అవగాహన వుంటుందని గ్రామ పారిశుధ్య వాహనాన్ని తానే నడుపుతూ గ్రామ వీధుల గుండా వెళ్ళి ఇంటింటి దగ్గర చెత్త సేకరిస్తూ వారి సమస్యలు తెలుసుకొంటూ తిరిగారు గ్రామప్రజలు సర్పంచ్ వాడ వాడలా తిరిగి సమస్యలు తెలుసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు.

## ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**టి మీడియా, జూన్ 1, ముదిగొండ**





మండలంలోని వెంకటాపురం గ్రామంలో గంట ఉమారాణి-నరేష్, జక్కుల ఎల్లయ్య-లక్ష్మి లకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి సర్పంచ్ కందుల బాలచందర్ హాజరై రిబ్బన్ కట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు గంట వెంకట్రావు, ఏఈ వెంకట అప్పారావు, సెక్రటరీ స్రవంతి, వార్డ్ మెంబెర్ బంక భవాని, ఎస్సీ సెల్ అధ్యక్షులు గంట కృష్ణ, బంక బాలరాజు, బంక నాగేశ్వరావు, బంక గురవయ్య, గంట శ్రీను, జక్కుల ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్దిదారులు ప్రభుత్వానికి, డిప్యూటీ సీం మల్లు భట్టి విక్రమార్కకి, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరావు గారికి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపూడి బుచ్చిరామయ్య గారికి ధన్యవాదములు తెలిపారు.

## సర్వర్ ప్రాబ్లం పింఛన్లు బంద్



**టీ మీడియా ,జూన్ 1, ఆత్మకూరు :**వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో పింఛన్లు ఇస్తలేరని ఆత్మకూర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న వికలాంగులు వితంతువులు ఒంటరి మహిళలు వృద్ధులు పింఛన్లు ఇయాల అని ధర్నా చేశారు. ఈ విషయమై పోస్టు మాస్టర్ ను సంప్రదించగా ఈరోజు సర్వర్ ప్రాబ్లం ఉన్నందున పెన్షన్లు ఇవ్వడానికి రాలేదని, ఇతర గ్రామాల పింఛన్దారులు చెప్పిన వినకుండా ఆత్మకూరుకు వచ్చి పెన్షన్ ఇయ్యాలని పోస్ట్ ఆఫీస్ లో గుమ్మిగూడారు. సర్వర్ రావడం లేదు రేపు రండి అని చెప్పినా వినకుండా ధర్నా చేశారని పోస్ట్ మాస్టర్ తెలిపారు.

## ధాన్యం కొనకపోతే రైతులతో కలెక్టరేట్ ముట్టడిస్తాం

- బీఆర్ఎస్ యువజన విభాగం కార్యదర్శికోటి భాస్కర్



**టీ మీడియా ,జూన్1, టేక్మాల్:**ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయడంలో జాప్యం జరుగుతుండటంతో టేక్మాల్ మండల రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ ధర్నాకు జిల్లా బీఆర్ఎస్ యువజన విభాగం కార్యదర్శి నాయికోటి భాస్కర్ హాజరై రైతులకు సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా నాయికోటి భాస్కర్ మాట్లాడుతూ.. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక అన్నదాతల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, తూకం వేయడంలో ఆలస్యం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన మండిపడ్డారు. ఇప్పటికే ఎండకు ఎండి, వానకు తడిసి ధాన్యం రంగు మారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అధికారుల తీరుపై విసిగిపోయిన రైతులు, తమ ఆవేదనను తెలియజేసేందుకు ధాన్యం కుప్పలకు నిప్పు అంటించే ప్రయత్నం చేశారు. దీనిని గమనించిన అధికారులు వెంటనే అప్రమత్తమై,రైతులకు నచ్చజెప్పి.సిఐ రేణుకమేడం. ఎమ్మార్వో. తులసీరావు.ఎంపిడిఓ రేయజ్జిద్దీన్ కలిసి ఆందోళనను విరమింపజేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని పూర్తిస్థాయిలో తూకం వేయాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ కార్యాలయం ముందు భారీ నిరసన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈకార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు కమ్మరి సిద్ధయ్య సాదు కిషన్,బోట్ల సత్యం,రైతులు బాలకృష్ణ శ్రీరామ్.పోచయ్య గణేష్. శోభన్.ఎల్లప్ప.అంజయ్య.రైతులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

## మండల పార్టీ అధ్యక్షునికిసన్మానం





**టి మీడియా జూన్, 1పెబ్బేరు:**పెబ్బేరు మండలంలోని గుమ్మడం గ్రామంలో నూతనంగా ఎన్నికైన పెబ్బేర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు యాపర్ల రాంరెడ్డి కి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డికి ఘనంగా సన్మానం చేసి పూలబొకే అందజేసిన గుమ్మడం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుధాకర్ నాయుడు ఎక్స్ ఎంపిటిసి కురుమన్న నిరంజన్ రెడ్డి హరిబాబు కే రాజు బి కృష్ణయ్య మల్లికార్జున్ దశరథం అయ్యవారిపల్లి లక్ష్మణ్ నాయుడు లగి శెట్టి బాలరాజు గుమ్మడం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకం కింద ఎమ్మెల్యే వివాహం

- ఎడ్ల బండిపై ఊరేగింపు- స్వయంగా నడిపిన డిప్యూటీ సీఎం

**టి మీడియా, జూన్ 1, ఢిల్లీ బ్యూరో :**
ఛత్తీస్?గఢ్?కు చెందిన ఓ ఎమ్మెల్యే వివాహం ఇప్పుడు హాట్ టాపిక్?గా మారింది. సాధారణంగా మన దేశంలో రాజకీయ నాయకుల పెళ్లి అంటే ధూమ్?ధామ్?గా జరుగుతుంది. కానీ ఆ ఎమ్మెల్యే మాత్రం ప్రభుత్వ పథకం కింద వివాహం చేసుకున్నారు. ఆశ్చర్యంగా ఉందా? అయితే ఈ పూర్తి కథనం చదవండి.ఛత్తీస్?గఢ్?లోని బెమెతరా ప్రాంతానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే దీపేశ్? సాహు. ఆయన ఛత్తీస్?గఢ్ ప్రభుత్వ పథకమైన "ముఖ్యమంత్రి కన్యా వివాహ యోజన" స్కీమ్? కింద ఆదివారం తరుణా సాహును వివాహం చేసుకున్నారు. అత్యంత సాదాసీదా సామూహిక వివాహ వేడుకలో భాగంగా జరిగిన ఈ పెళ్లి ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఎమ్మెల్యే చేసిన ఈ పనిపై స్థానిక ప్రజలు, రాజకీయ నేతలు ప్రశంసలు కురిపిస్తున్నారు.ఈ సామూహిక వివాహ వేడుకలో బీజేపీ ఎమ్మెల్యేతోపాటు మరో 20కి పైగా జంటలు కూడా పెళ్లి చేసుకున్నాయి. అంతకు ముందు దీపేశ్? సాహు సంప్రదాయబద్ధంగా ఎడ్ల బండిపై ఊరేగింపుగా పెళ్లి మండపానికి వచ్చారు. ఛత్తీస్?గఢ్ ఉపముఖ్యమంత్రి అరుణ్ ?సావో? స్వయంగా ఆ ఎడ్లబండిని నడిపారు. దీనితో ఈ పెళ్లిని



చూడడానికి చాలా మంది ప్రజలు తరలివచ్చారు. ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండాఅత్యంత సాదాసీదాగా పెళ్లి చేసుకున్నందుకు వారంతా ఎమ్మెల్యేపై ప్రశంసలు కురిపించారు. మరోవైపు ఎమ్మెల్యే దీపేశ్? తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఛత్తీస్?గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్? అభినందించారు. పెళ్లిళ్ల కోసం భారీగా ఖర్చు చేస్తూ చాలా కుటుంబాలు అప్పులపాలు అవుతున్న ఈ రోజుల్లో, దీపేశ్? తీసుకున్న ఈ నిర్ణయం సమాజానికి ఒక మంచి సందేశాన్ని ఇచ్చిందని అన్నారు.

భారీ వర్షంతో ఇబ్బందులు
అయితే ఈ ప్రభుత్వ సామూహిక వివాహ వేడుకకు భారీ వర్షం రూపంలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. వాతావరణం ఏమాత్రం బాగాలేకపోవడంతో ముఖ్యమంత్రి విష్ణుదేవ్? సాయ్ వివాహ వేదిక వద్దకు చేరుకోలేకపోయారు. దీనితో ఆయన ఒక ప్రభుత్వ విశ్రాంతి భవనం నుంచే ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన బెమెతరా జిల్లా కోసం రూ. 105 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులు ప్రారంభించారు. అలాగే మరికొన్ని కొత్త ప్రాజెక్టులను ప్రకటించారు.

అధికారులపై స్పీకర్ ఆగ్రహం
మరోవైపు, సామూహిక వివాహ వేదికపై నుంచి ఛత్తీస్?గఢ్? అసెంబ్లీ స్పీకర్ రమణ్? సింగ్? కింద పడిపోయారు. దీనితో ఆయన జిల్లా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేదికపై కూర్చోవడానికి సరైన కుర్చీలు వేయకపోవడం, వర్షం వల్ల ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయనందుకు ఆయన సదరు అధికారులపై మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, సీనియర్ మంత్రులు వచ్చే ఇలాంటి కార్యక్రమానికి సరైన ఏర్పాట్లు చేయకపోవడమేంటని ప్రశ్నించారు.
సాధారణంగా సామూహిక వివాహాలు జరిగే వేదిక వద్ద వాటర్?ప్రూఫ్? పందిరిలు వేస్తుంటారు. దీని వల్ల అకస్మాత్తుగా వర్షం పడినా ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ ఇక్కడ జరిగిన ప్రభుత్వ సామూహిక వివాహ వేడుక కోసం అధికారులు సరైన ఏర్పాట్లు చేయలేదు. ముఖ్యంగా వాటర్? ప్రూఫ్? వివాహ పందిరి వేయలేదు. అదే సమయంలో భారీ వర్షం పడడంతో పెళ్లి వేడుకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది' అంటూ స్పీకర్ మండిపడ్డారు. స్థానికులు, పెళ్లికి వచ్చిన వారు కూడా అధికారుల తీరుపై విమర్శలు గుప్పించారు.

# ఇంటి ముందు క్రికెట్ ఆడినందుకు దారుణం

- కేసు పెట్టి, కాళ్లు మొక్కించుకున్న కాంగ్రెస్ నేత

**టి మీడియా, జూన్ 1 ,హైదరాబాద్ బ్యూరో :** అభం శుభం తెలియని చిన్నారులు ఇంటి ముందు క్రికెట్ ఆడారని అధికార కాంగ్రెస్ పార్టీ నేత ఆ పిల్లల తల్లిదండ్రులతో అమానవీయంగా ప్రవర్తించాడు. వారిపై దాడి చేయడమే కాకుండా తన అధికార బలంతో ఉప్పల్? పోలీస్ స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదుతో భయపెట్టాడు. ఫిర్యాదు వెనక్కి తీసుకుంటానంటూ అర్ధరాత్రి వేళ ఆ దంపతులతో పోలీస్?స్టేషన్?లోనే కాళ్లు మొక్కించుకున్నాడు. మే నెల 25న ఉప్పల్‌లో జరిగిన ఈ దారుణం ఆలస్యంగా వెలుగు చూసింది. ఓ వ్యక్తి పోలీసు స్టేషన్?లో హంగామా చేస్తున్నా, తప్పుడు ఫిర్యాదిచ్చినా పోలీసులు ఎలాంటి చర్యలకు పూనుకోకుండా ఉండటం విమర్శలకు దారితీస్తోంది. స్పెషల్ బ్రాంచి పోలీసులు ఈ ఘటనపై నివేదిక సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

పిల్లలపై బూతులు - పెద్దలపై దాడి
బిహార్‌కు చెందిన లీలావతి, ఆమె భర్త ఉప్పల్ ఐడీఏ ప్రాంతంలోని లక్ష్మీనారాయణ కాలనీలో ఉంటూ ఐడీఏలోని ఓ కంపెనీలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు. మే 25న సాయంత్రం పొద్దుపోయాక లీలావతి, ఇద్దరు పిల్లలు, మరికొంత మందితో కలిసి కాలనీలోని రోడ్డుపై గల్లీ క్రికెట్ ఆడారు. అదే కాలనీలో ఉండే మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ నేతకు తన ఇంటి ముందు పిల్లలు ఆడుకోవడం ఏ మాత్రం నచ్చలేదు. రాత్రివేళ ఆటలేంటంటూ దారుణమైన బూతులు తిడుతూ బెదిరింపులకు దిగాడు.కాంగ్రెస్ నేత దూషణతో విసిగిపోయిన లీలావతి ప్రశ్నించగా, ఆగ్రహంతో మహిళ అని కూడా చూడకుండా తిడుతూ దాడికి దిగాడు ఆ ప్రబుద్ధుడు. దీంతో ఆమె ధరించిన డ్రెస్సు చిరిగిపోయింది. అడ్డుకోబోయిన ఆమె భర్తపై దాడి చేశాడు. దీంతో అతని కన్ను పైభాగం పై గాయమై తీవ్ర రక్తస్రావమైంది. వీడియోలు తీస్తుంటే తీసుకోండి నాకేమైనా భయమా? అంటూ దబాయించాడు. అసలు ట్విస్టు ఏంటంటే, దాడి చేసిన వ్యక్తే ఉప్పల్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. రాత్రివేళ పోలీసులు వచ్చి గాయపడ్డ దంపతులకు రక్షణ కల్పించాల్సింది పోయి, పెట్రోలింగ్ వాహనంలో ఎక్కించుకుని బాధితులనే పోలీస్?స్టేషన్?కు తీసుకెళ్లారు. పిల్లలు ఆటలాడటాన్ని ఇంతలా రచ్చచేసిన నేత తీరును చూసి స్థానికులు విస్తుపోయారు.

దొంగతనం చేశారని ఫిర్యాదు
తమపై జరిగిన దాడిని వివరించి ఫిర్యాదు చేసేందుకు బాధితులు ప్రయత్నించగా, పోలీస్? స్టేషన్? సిబ్బంది తిరస్కరించారు. బాధితులైన తమ నుంచి ఫిర్యాదు తీసుకోకపోవడంతో వారు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. దాడి వీడియోలు వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టడంతో తప్పు కప్పిపుచ్చుకోవడానికి సదరు నేత అర్ధరాత్రి హుటాహుటిన పీఎస్?కు వెళ్లాడు. లీలావతి కుటుంబం తన బంగారు గొలుసు దొంగతనం చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఒకవైపు గాయపడి, అర్ధరాత్రి స్టేషన్‌కు వచ్చి అవమానంతో కుంగిపోతున్న ఆ కుటుంబం మరింత ఆందోళనకు గురయింది.




తమపై దొంగతనం కేసు నమోదవుతుందేమోనని భయపడ్డారు. పని చేసుకుంటేనే బతికేవాళ్లం, తమపై చోరీ కేసు పెట్టొద్దని ప్రాధేయపడ్డారు. తన కాళ్లు మొక్కి, తప్పు చేశామని ఒప్పుకొంటేనే కంప్లైంట్? వెనక్కి తీసుకుంటానని ఆ లీడర్? బెదిరించాడు. దీంతో బాధితులు గత్యంతరం లేక పోలీసుల సాక్షిగా కాళ్లు మొక్కి వేడుకున్నట్లు వీడియోలు చక్కర్లు కొడుతున్నాయి. దీంతో ఆ నేత వారిని వదిలేశాడు.ఈ ఉదంతంలో పోలీసులు బాధితుల పక్షాన కాకుండా దాడి చేసిన వ్యక్తికి మద్దతుగా నిలవడం, పోలీస్ స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు ఇచ్చి, వారి పట్ల అవమానవీయంగా ప్రవర్తిస్తున్నా ఖాకీలు నోరు మెదపకపోవడం చర్చనీయాంశంగా మారింది. తన మీద జరిగిన దాడి, పోలీసు స్టేషన్?లో అవమానాన్ని వివరిస్తూ బాధితురాలు తీసుకున్న సెల్ఫీ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ ఘటనపై మల్కాజ్?గిరి పోలీసు కమిషనర్ సుమతి రెడ్డి ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది.

# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

### - మంగళవారం 3 ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల

**టి మీడియా, జూన్ 1 ,హైదరాబాద్ బ్యూరో:** నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీపై ప్రకటన చేసింది. నోటిఫికేషన్‌ల విడుదలతో పాటు పరీక్ష విధానంలో తీసుకురానున్న మార్పులపై టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం కీలక వివరాలను వెల్లడించారు. మంగళవారం ఒకేసారి 3 కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేస్తామని చెప్పారు. కంప్యూటర్ బేస్డ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

**మూడు ఉద్యోగ నోటిఫికేషన్‌లు**
**రాష్ట్రంలో** ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఊపందుకోనుంది. టీజీపీఎస్సీ ద్వారా అనేక ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. నెలలో 2 నుంచి 3 నోటిఫికేషన్‌లు విడుదల చేస్తామన్నారు. మంగళవారం ఒకేసారి 3 కొత్త ఉద్యోగ ప్రకటనలిస్తామన్నారు. ఇప్పటికే వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న సుమారు 3800 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి ఇచ్చిందని తెలిపారు. టీజీపీఎస్సీలో ప్రస్తుతం 28 రకాల పోస్టులకు ఒక్కో ఖాళీ ఉందని, మరో 25 రకాల పోస్టుల్లో 5 కంటే తక్కువ ఖాళీలున్నాయని వివరించారు. ఈ నెలలో 5 నుంచి 6 నోటిఫికేషన్లు విడుదలచేసే యోచనలో ఉన్నట్లు బుర్రా వెంకటేశం తెలిపారు.

**కంప్యూటర్ ఆధారిత విధానంలో**
పరీక్షల నిర్వహణలో లీకేజీలకు తావులేకుండా, పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు టీజీపీఎస్సీ ఛైర్మన్ వివరించారు. భవిష్యత్‌తో పరీక్షలను ఒమర్ విధానంలో కాకుండా, కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. ఆ విధానంలో పరీక్ష ముగిసిన వెంటనే అభ్యర్థులకి మార్కులు తెలిసే అవకాశం ఉంటుందన్నారు.

**ప్రతిభా భారతి కార్యక్రమం**
యూపీఎస్సీకి చెందిన ప్రతిభాసేతు తరహాలో రాష్ట్రంలో ప్రతిభా భారతి కార్యక్రమం నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిపారు. టీజీపీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ కొలువులివ్వడం సాధ్యం కాదని బుర్రా వెంకటేశం తెలిపారు. తమది చాలా క్లిష్టమైన ఉద్యోగమని, అందరినీ మెప్పించడం సాధ్యం కాదన్నారు

# పగటిపూట భానుడి భగభగలు

### సాయంత్రానికి ఉరుములు, మెరుపులు

**టి మీడియా, జూన్ 1 ,హైదరాబాద్ బ్యూరో :**



తెలంగాణ రాష్ట్రంలో పగలంతా తీవ్రమైన ఎండ, పొద్దుపోయే సమయానికి భారీ వానలు ఇటువంటి భిన్నమైన వాతావరణం ఇప్పుడు రైతులతో పాటు జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఎటువంటి సూచనలు లేకుండానే ఒక్కసారిగా భారీ గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. ఇటీవల పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు పండిన పంట దిగుబడులు వరదలో కొట్టుకుపోయాయి. కల్లాలు, వాహనాల్లో నింపిన ధాన్యమంతా తడిసింది. జూన్ ఆరో తేదీ వరకు ఇలాంటి వర్షాలు కురిసే అవకాశాలున్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో (గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగం) కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. అన్ని జిల్లాల్లో ఈ వర్షాలు పడతాయని, పసుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది.

**ఎండల తీవ్రత కూడా**
పలు జిల్లాల్లో ఎండల తీవ్రత మరింత కొనసాగుతుందని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. సోమవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, ఆసిఫాబాద్, జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం, నల్గొండ వంటి జిల్లాల్లో 44 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపింది. మంగళ, బుధ, గురువారాల్లో సైతం ఇదే పరిస్థితి కొనసాగుతుందని పేర్కొంది. ఆదివారం రాష్ట్రంలోనే అత్యధికంగా ఖమ్మం జిల్లా రూరల్ మండలంలో 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది.
మరో 29 జిల్లాల్లో 40.1 నుంచి 44.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు

# హైదరాబాద్‌లో పవన్‌కల్యాణ్ సభ

రాజకీయ నాయకులు చేసిన వ్యాఖ్యల వల్ల తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని దర్యాప్తులో తేలిందన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, వ్యతిరేక ఆందోళనలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. అదే విధంగా ఈ సమావేశం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల సమయంలో జరగనుండటంతో, భారీ స్థాయిలో నిరసనలు, ప్రదర్శనలు, ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉందని డిసిపి పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో సమావేశం నిర్వహిస్తే శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందని వెల్లడించారు.

**పార్కింగ్ కూడా సరిగా లేదు**
మరోవైపు, సమావేశానికి వచ్చే సుమారు 2 వేల మంది కోసం సరిపడా పార్కింగ్ సదుపాయం లేదని వేదిక యాజమాన్యం ధృవీకరించిందన్నారు. నిర్వాహకులు పార్కింగ్ కోసం ఉపయోగించాలనుకున్న ఎఫ్‌సీఐ సొసైటీ లేఅవుట్ భూమి ప్రస్తుతం వివాదాస్పదంగా ఉండి, దానికి సంబంధించి పలు క్రిమినల్ కేసులు కోర్టులో విచారణలో ఉన్నాయని తెలిపారు. ఈ పరిస్థితులన్నింటినీ పరిగణనలోకి తీసుకుని, శాంతిభద్రతలు దృష్ట్యా జనసేన ప్రతిపాదిత సమావేశానికి అనుమతి నిరాకరిస్తున్నట్లు శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.సమావేశానికి కూడా అనుమతి ఇవ్వరా : అయితే ఇది సభ కాదని, కేవలం సమావేశం నిర్వహించుకుంటున్నామని ఆ పార్టీ వైస్? ప్రెసిడెంట్ మహేందర్ రెడ్డి తెలిపారు. సమావేశమే అయినందున పోలీసులకు సమాచారం ఇస్తే సరిపోతుందని, అనుమతి ఎందుకు తీసుకోవాలని ప్రశ్నించారు. సరైన కారణాలు చెప్పకుండా పోలీసులు అనుమతి నిరాకరించారని, అందుకే అనుమతి కోసం కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు.